TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9440555990

సంపుటి : 01 సంచిక : 286 | శనివారం జూన్ 21 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

## బనకచర్లపై ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చలకు సిద్ధం: రేవంత్‌రెడ్డి



బనకచర్ల అంశం గురించి కూర్చొని మాట్లాడుకుంటే వివాదం ఉండదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

దిల్లీ: బనకచర్ల అంశం గురించి కూర్చొని మాట్లాడుకుంటే వివాదం ఉండదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బనకచర్ల-గోదావరి ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబుతో చర్చలకు సిద్ధమని ప్రకటించారు. “ఏపీ.. కేంద్రానికి పీఎఫ్ఆర్ ఇవ్వడం వల్లే వివాదం మొదలైంది. 2లో

## ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా పడుకోలేను: మోదీ

- ఎన్డీయే హయాంలోనే బిహార్ అభివృద్ధి దిశగా సాగుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



వివరాలు 2 లో..

## విద్వేషాలు రెచ్చగొట్టడమే బీజేపీ పని : మంత్రి సీతక్క

- గిరిజనులను చెట్లకు కట్టేసి కొట్టించిన చరిత్ర బీఆర్ఎస్ ది
- రాహుల్ గాంధీది స్వాతంత్ర్యం కోసం పోరాడిన కుటుంబం
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క

## పరస్పర అవగాహనతో కాంగ్రెస్, భారాస ముందుకెళుతున్నాయి: కిషన్‌రెడ్డి



మిగతాది 2లో

## కేసీఆర్‌ను విలన్ చేసే యత్నంలో హరీష్

- నీళ్లతో రాజకీయం చేసిన పార్టీ బిఆర్ఎస్
- జగన్‌తో కుమ్మక్కయి కృష్ణ జలాలకు తిలోదకాలు
- భువనగిరి ఎంపి చామల కిరణ కుమార్



బీఆర్ఎస్ నేత హరీష్ రావు వాళ్ల మామ.. మాజీ సీఎం కేసీఆర్‌ను విలన్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ ఆరోపించారు. నీళ్ళు అనే పదంతో బీఆర్ఎస్ రాజకీయం చేసిందని, బీఆర్ఎస్ నేతలు బేసిక్ నాలెడ్జ్‌తో ప్రాజెక్టులు కడితే బాగుండేదని అన్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత తెలంగాణ ప్రజలకు నీళ్ల సంగతి పూర్తిగా అర్థమైందని, 2016 సీడబ్ల్యూసీ మీటింగ్‌లో కేసీఆర్ ఏం మాట్లాడారో చెప్పాలన్నారు. కేసీఆర్‌కు ఉన్న అపరజ్ఞానం వల్లే కాళేశ్వరం కూలేశ్వరం అయిందని విమర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడారు. 2లో

## భారత్ కోసం గగనతలాన్ని తెరచిన ఇరాన్.. 1000 మంది విద్యార్థులు స్వదేశానికి!

- ఇటీవల తన గగనతలాన్ని మూసివేసిన ఇరాన్.. భారత్ కోసం ప్రత్యేకంగా మినహాయింపు ఇచ్చేందుకు సిద్ధమైంది.



ఇజ్రాయెల్-ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల తన గగనతలాన్ని మూసివేసిన ఇరాన్.. 2లో

## పోలవరంతో భద్రాచలం మునక

- రాముడు తెలంగాణలో..భూములు ఎపిలో
- ఎపిలో కలిపిన ఐదూళ్లు వెంటనే వెనక్కి ఇచ్చేయాలి
- తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత డిమాండ్

పోలవరం నిర్మాణంతో భద్రాచంల పూర్తిగా మునిగిపోవడం ఖాయమని, అందుకే తాము పోలవరం ప్రాజెక్టు నిర్వహణ అంశాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యతిరేకించామని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అప్పట్లో తాము సుప్రీంకోర్టుకు వెళ్లి ఆపే ప్రయత్నం చేసినా ప్రాజెక్టు ఆగలేదని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణకు ముంపుపై శుక్రవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. 2లో



## వాటికి పెట్టే ఖర్చుతో మరో 14 ప్రాజెక్టులు పూర్తి చేయొచ్చు: ఎమ్మెల్యే కూనంనేని

- కాళేశ్వరం ప్రాజెక్టుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక

హైదరాబాద్: మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు తీసేసి.. వాటిలోని పైపులను వాడుకోవాలని సూచించారు. 2లో



# సంపాదకీయం

## విషం.. విషాదం.. గుణపాఠం

పాకిస్థాన్ నుంచి ఏం నేర్చుకోగలం? ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రశ్నే అసంబద్ధంగా అనిపిస్తుంది! పహల్గాం దారుణం.. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ వ్యతిరేక ఉద్వేగాల్లో ఊగిపోవటమే ఎక్కువ కనపడుతోంది. ఉద్వేగాల్లో ఊగిపోతున్నప్పుడు తార్కిక ఆలోచన మందగిస్తుంది. గతం%-%వర్తమానం మధ్య సంబంధాలను పట్టించుకోలేం. దీర్ఘకాలిక దృష్టితో వ్యవహారాలను చూడలేం. నిలకడగా విషయాల లోతుల్లోకి వెళ్లలేం. ఇవన్నీ అవగాహనకు అడ్డంకులుగా నిలిచే మాట నిజమే! ఈ లోటుపాట్లు ఉన్నా ఉద్వేగభరిత వాతావరణం వాస్తవాల తీరంవైపు వెళ్లేందుకూ కొంత తోడ్పడుతుంది. దేశాల చరిత్రల నుంచి గుణపాఠాలు నేర్చుకునేలా చేస్తుంది. నియంతృత్వ రాజ్యం కిరాతకాల నుంచీ మతతత్వ ఉన్మాదాల నుంచీ, మైనారిటీల దారుణ అణచివేతల నుంచీ దూరంగా ఉందామనుకుంటే పాకిస్థాన్ నుంచి మనం నేర్చుకునేది చాలానే ఉంటుంది. మతం ఏదైనా కావచ్చు. దాన్ని రాజకీయ ప్రయోజనాలకూ, ప్రభుత్వ విధానాలకూ ఆధారం చేసుకుంటే జరిగే నష్టం భారీగా ఉంటుంది. మెజారిటీ మతోన్మాదంతో పౌరహక్కులు హరించుకుపోతాయి. మతంలో మంచిచెడులు ఉన్నాయని చెప్పటమే జాతి వ్యతిరేకత అయిపోతుంది. మతాన్ని వ్యతిరేకించటం దేశద్రోహంగా మారిపోతుంది. లౌకిక వాదం విదేశీ సిద్ధాంతంగా ముద్రపడుతుంది. పాశ్చాత్య వైపరీత్యంగా సామ్యవాద దృక్పథంపై వ్యతిరేక ప్రచారం జరుగుతుంది. స్వేచ్ఛా ఆలోచనలకూ, ప్రయోగాలకూ సంకెళ్లు పడతాయి. మొత్తంగా దేశమే ఆలోచనలపరంగా అధోగతి వైపుగా అడుగులు వేస్తుంది. మానవ మేధే సంకుచితమై పోతుంది. ఈ విపరిణామాలన్నిటికీ పాకిస్థాన్ ఎలా రంగస్థలంగా మారిపోయిందో వివరిస్తూ ఆ దేశానికే చెందిన ప్రముఖ పరిశోధకురాలు ఫరానాజ్ ఇస్పాహానీ అద్భుతమైన పుస్తకం రాశారు. పాకిస్థాన్ అంటే పవిత్రభూమి అనే అర్థమూ ఉంది. అట్లాంటి పవిత్రభూమిని మరింత పవిత్రంగా మారుస్తామనే లక్ష్యంతో మతతత్వవాదులు ఒడికట్టిన దారుణాలను 'ప్యూరిఫయింగ్ ద ల్యాండ్ ఆఫ్ ద ప్యూర్'లో లోతుగా విశ్లేషించారు. అమెరికాలోనూ నివసించి ఆ తర్వాత పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ తరఫున ఒక దఫా నేషనల్ అసెంబ్లీకీ ఫరానాజ్ ఎన్నికయ్యారు. అయినా తాను ఒకనాడు ప్రాతినిధ్యం వహించిన పార్టీ తప్పిదాలనూ, వైఫల్యాలనూ, పరిమితులనూ నిశితంగా విమర్శించారు. ఇస్లామిక్ తీవ్రవాదానికి అల్పసంఖ్యాక వర్గాలు.. పాక్‌లోలాగా భారీగా బలి అవ్వటం ఎక్కడా జరగలేదు.

1947 నాటి భారత నాయకత్వం పాకిస్థాన్ ఒక రాజ్యంగా మనుగడ సాగిస్తుందని భావించలేదు. ఎప్పటికైనా అది భారత్‌లో మళ్లీ కలవక తప్పదనే ప్రకటనలు అప్పుడు చాలా వెలువడ్డాయి. వాటికి భిన్నంగా పాకిస్థాన్ ఇప్పటికీ ఒక రాజ్యంగా కొనసాగుతూ ఉండొచ్చు. కానీ ప్రజాస్వామ్యయుగంలో ఆధునిక విలువలపరంగా పాకిస్థాన్ విఫల దేశంగానే మిగిలిపోయింది. ఆధిపత్య వర్గాలు మతాన్ని ఆయుధంగా చేసుకుని అధికారాన్ని నిలుపుకొనే ప్రయత్నాల్లో ఆలోచనలూ, ప్రవర్తనలూ ఎంతటి విషతుల్యంగా మారిపోతాయనటానికి పాకిస్థాన్‌ను ఉదాహరణగా చెప్పుకొన్నా ఆ ప్రమాదం భారత్‌కు పూర్తిగా లేదనీ భరోసా ఇచ్చుకోలేం. మతంకోణంతో ఆలోచించటం ఇటీవల కాలంలో పెరిగిపోతోందని ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి. పాఠశాలలూ, కళాశాలల బోధనల్లో ఏకపక్ష చరిత్రలూ, వక్రీకరణలూ పెరిగిపోతున్నాయి. హిందూ%-%ముస్లిం సంస్కృతులూ పరస్పర విరుద్ధమైనవేనంటూ వ్యాఖ్యానాలూ, రెండిటి మధ్యా వెయ్యేళ్లకు పైగా సంఘర్షణలూ సాగుతున్నాయంటూ సూత్రీకరణలూ వెల్లువెత్తుతున్నాయి. హిందూ సంస్కృతికి అందరూ లోబడి మసలాలనే వాదనలూ బలపడుతున్నాయి. మతాలు మనుషులకు కొత్తకాదు. భిన్న దేవతారాధనలూ కొత్తకాదు. ఒక మత ఆధిపత్యానికి పెద్దపీట వేసే మతతత్వాలు మాత్రం కొత్తవైనవి. రాజకీయాలు, అధికార తాపత్రయాలు లేకుండా మతతత్వాలు ఊపిరిపోసుకోలేవు. అవి లేనిదే వాటిని ఆచరణలో పెట్టే శక్తులు వ్యవస్థీకృతంగా వ్యవహరించలేవు. 1949లో ప్రకటించిన రాజ్యాంగ లక్ష్యాల తీర్మానంతోనే పాకిస్థాన్‌లో మతతత్వ రాజకీయాలకు పునాది పడింది. ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పాటుచేయటమే రాజ్యాంగ రచన లక్ష్యంగా ఆ తీర్మానం పేర్కొంది. దాన్ని పాక్ రాజ్యాంగ సభ ఆమోదించింది. పాకిస్థాన్ ఏర్పాటుకు కీలక సూత్రధారి అయిన జిన్నా అప్పటికే మరణించారు. జిన్నా బతికి ఉంటే దాన్ని ఆమోదించేవారా? వ్యతిరేకించేవారా? అన్న విషయంపై ఇప్పటికీ ఏకాభిప్రాయం లేదు. హిందువులూ ముస్లింలూ రెండు విభిన్న జాతులకు చెందుతారనే సిద్ధాంత ప్రచారంతో పాకిస్థాన్ ఏర్పాటు కోసం జిన్నా రాజకీయ వ్యూహాలకు పదునుపెట్టటం తీవ్ర మత విభజనపరమైన ఆలోచనలకు దారితీసింది. అందులో సందేహం లేదు. కానీ ప్రత్యేక దేశంగా పాకిస్థాన్ ఏర్పాటు ఖాయమని తేలిపోయిన తర్వాత జిన్నా ద్విజాతి సిద్ధాంతం గురించి మాట్లాడలేదు. పాకిస్థాన్ రాజ్యాంగ సభలో 1947 ఆగస్టు 11న చేసిన ఉపన్యాసంలో మతానికి, రాజ్యానికి సంబంధంలేదని స్పష్టంగా వ్యాఖ్యానించారు. కుల, మత, జాతుల ఆధారంగా పాక్ ప్రభుత్వ వ్యవహారాలు ఉండవనీ ప్రతి పౌరుడికీ తాననుకున్న రీతిలో గుడికి, మసీదుకు, చర్చికి వెళ్లే స్వేచ్ఛ ఉందనీ చెప్పారు.

నవీన పాకిస్థాన్‌లో హిందువు హిందువుగా ఉండడనీ, ముస్లిం ముస్లింగా ఉండడనీ, క్రిస్టియన్ క్రిస్టియన్‌గా ఉండడనీ, ప్రతి వ్యక్తీ పౌరుడుగా మాత్రమే గుర్తింపు పొందుతాడనీ మతం వ్యక్తిగత విశ్వాసానికి మాత్రమే పరిమితమవుతుందనీ ఘనంగా చెప్పారు. అందుకు అనుగుణంగా గవర్నరు జనరల్‌గా ఉండగా కొన్ని నిర్ణయాలూ తీసుకున్నారు. హిందువైన జోగేంద్రనాథ్ మండల్‌ను న్యాయశాఖ మంత్రిగా నియమించారు. అహ్మదీయ శాఖకు చెందిన జఫరుల్లా ఖాన్‌కు తొలి విదేశాంగ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. మతరాజ్యం గురించి మాట్లాడటాన్నీ గర్హించారు. అలాగే పదవుల్లో మైనారిటీ షియాలకూ సముచిత ప్రాధాన్యం ఇచ్చారు. చాలామంది అనుకున్నట్లుగా జిన్నా ఇస్లాంలోని ప్రధాన సున్నీ శాఖకు చెందినవారు కాదు. ఆయన షియా ముస్లిం. విషాదం ఏమిటంటే తర్వాతి కాలంలో షియాల ఊచకోత పాక్‌లో సర్వసాధారణమైంది. అలాగే అహ్మదీయులను ముస్లింలుగా పరిగణించకూడదంటూ రాజ్యాంగ సవరణనే తీసుకొచ్చారు. మతతత్వ ఆలోచనలు అధికారాన్ని సాధించటానికీ, నిలబెట్టుకోటానికీ అవసరమైనప్పుడు చరిత్ర వక్రీకరణ సర్వసాధారణంగా జరుగుతుంది. జిన్నా రాజ్యాంగసభలో చేసిన ఆ ఉపన్యాసాన్ని పలు విధాలుగా తొక్కిపట్టి, సాధారణ ప్రజలకు దాన్ని చేరకుండా చేయటమే ఇందుకు నిదర్శనం. పాక్ తొలి ప్రధాని లియాఖత్ అలీ ఖాన్ దానికి పూనుకున్నారు. ద్విజాతి సిద్ధాంతాన్ని తిరస్కరించేలా జిన్నా ప్రసంగం ఉండటం పాకిస్థాన్ మనుగడకే ప్రమాదంగా పరిగణించారు. అందుకే దానికి పూర్తి విరుద్ధంగా రాజ్యాంగ లక్ష్యాల తీర్మానాన్ని రూపొందించారు. పవిత్ర ఖురాన్‌లోని బోధనలకు అనుగుణంగా వ్యక్తిగత, సామాజిక జీవితాన్ని తీర్చిదిద్దుకునేలా ముస్లింలకు తోడ్పటమే రాజ్యాంగ లక్ష్యమని పేర్కొన్నారు. రాజ్యాన్ని ఇస్లామిక్ పరిభాషలో నిర్వచించటంతోనే తర్వాతి కాలంలో మతపరమైన చట్టాలకు అడుగులు పడ్డాయి. మతాల వారీగా ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పరచారు. అన్ని మతాలకు చెందిన పౌరులు ఉమ్మడి ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం లేకుండా చేశారు. రాజ్యాంగ లక్ష్యాల తీర్మానం ఆమోదం పొందిన వెంటనే ముస్లిం మతగురువులు రంగంలోకి దిగి 22 సూత్రాల ప్రణాళికను ప్రకటించి షరియా చట్టాన్ని అమలుపరచటమే ప్రభుత్వ ధ్యేయం కావాలని డిమాండు చేశారు. ముస్లిం పురుషుడు మాత్రమే దేశాధినేత కావాలని స్పష్టం చేశారు.

ముస్లింలతో సమానంగా ముస్లిమేతరులకు హక్కులు ఉండకూడదనీ వాదించారు. మతగురువుల డిమాండ్లలో చాలా వాటిని ఆమోదిస్తూ 1956లో రాజ్యాంగాన్ని తయారుచేయటంతోనే పాక్ గతితప్పింది ముస్లిమేతరులను రాజ్యాధినేతగా అర్హత లేకుండా నిబంధనను పొందుపరచారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్థాన్‌గా దేశాన్ని పేర్కొన్నారు. తర్వాతి కాలంలో రాజ్యాంగాలను రద్దు చేయటం, పునరుద్ధరించటం చేసినా అంతకంతకూ మతతత్వ ప్రకరణలను పెంచారే కానీ తగ్గించలేదు. జియా ఉల్ హక్ కాలంలో రాజ్యాంగం, చట్టాలు పూర్తిగా మతతత్వంతో నిండిపోయాయి. ఎన్నికల ద్వారా ఎన్ని ప్రభుత్వాలు ఏర్పడినా వాటిని తొలగించలేక పోయారు. దైవదూషణ చట్టాలతో లక్షలాది మందిని ఖైదుచేశారు. మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఎంతటి బీభత్సాన్ని, ఎంతటి మానవహక్కుల హననానికి పాల్పడ్డారో ఫరానాజ్ తన పుస్తకంలో కళ్లకు కట్టినట్లు వర్ణించారు. ప్రభుత్వాల వెన్నుదన్నుతో, ప్రధాన పార్టీల పూనకాలతో మతతత్వం పేట్రేగితే మాటలో, చేతలో, చేతనలో ఎంత అమానవీయతా ఎంత క్రూరత్వమూ ప్రబలిపోతుందో వర్ణించలేం. దేశ విభజన

## ప్రజాసేవ చేయకపోతే

### ప్రశాంతంగా పడుకోలేను: మోదీ

మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బిహార్‌లో తాజాగా మరోసారి పర్యటించిన మోదీ.. కాంగ్రెస్, ఆర్జేడీ కూటమిపై నిప్పులు చెరిగారు. బిహార్‌ను 'లైసెన్స్ రాజ్' సుదీర్ఘ కాలం పేదరికంలోనే ఉంచిందని, ఇందులో దళితులే అతిపెద్ద బాధితులుగా మారారని ఆరోపించారు. రాష్ట్రంలోని సివాన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన.. ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు.

"బిహార్‌ను ఎన్డీయే అభివృద్ధి చేస్తుందనడానికి మర్హౌరా రైలు ఫ్యాక్టరీ ఓ ఉదాహరణ. ఇప్పుడు ఆఫ్రికాలోనూ బిహార్‌కు ప్రశంసలు వస్తాయి. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు పట్టించుకోని సరన్ జిల్లాలోనే ఈ రైల్వే ప్రాజెక్టు కొనసాగుతోంది. తయారీ, ఎగుమతుల్లో ఈ జిల్లా ఇప్పుడు ప్రపంచ పటంలో స్థానం సంపాదించుకుంది. బిహార్ అభివృద్ధిని సుదీర్ఘకాలంగా 'జంగిల్ రాజ్' అడ్డుకుంది. కానీ, ఇప్పుడు బిహార్‌లో తయారైన ఇంజిన్ ఆఫ్రికన్ రైలుకు శక్తినిస్తుంది" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని మా ప్రభుత్వం చెబుతుంటే.. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు మాత్రం 'పరివార్ కా సాత్' అంటూ వారి కుటుంబ శ్రేయస్సుకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో పేదరికానికి కాంగ్రెస్ 'లైసెన్స్ రాజ్' కారణమన్నారు. నేతల కుటుంబీకులు ధనవంతులు కాగా.. సామాన్యులు మాత్రం పేదలుగానే మిగిలిపోయారన్నారు. రానున్న రోజుల్లో మూడు కోట్ల ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రజాసేవ చేయకుంటే తాను ప్రశాంతంగా నిద్రపోలేనని.. రాత్రి-పగలు ప్రజల కోసమే పని చేస్తానని వ్యాఖ్యానించారు.

## వాటికి పెట్టే ఖర్చుతో

### మరో 14 ప్రాజెక్టులు పూర్తి చేయొచ్చు: ఎమ్మెల్యే కూనంనేని

మొదటిపేజీ తరువాయి

ఆ మూడు బ్యారేజీల మరమ్మతులకు రూ.20వేల కోట్లు ఖర్చు అవుతోందని, అంత ఖర్చు పెట్టినా వరద ఉద్ధృతి వల్ల బ్యారేజీలు కొట్టుకుపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారని అన్నారు. ఆ మూడు ప్రాజెక్టులకు పెట్టే ఖర్చుకు బదులు ప్రాణహిత పూర్తి చేస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు.

"3 ప్రాజెక్టులు తీసేయడం వల్ల కేవలం రూ.10వేల కోట్ల నష్టం వస్తుంది. వీటికి మరమ్మతులు చేసే బదులు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో గోదావరిపై 14 చిన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వృథా అని నేను చెప్పలేదు. కేవలం ఆ మూడు బ్యారేజీలపై మాత్రమే మా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం. తెలంగాణను సంప్రదించకుండా ఏపీ సీఎం చంద్రబాబు ప్రాజెక్టులు చెపడుతున్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపేయాలి.

పరివాహక ప్రాంతాల వారీగా నిబంధనల మేరకు నీటి వాటాలు జరగాలి. ఇద్దరు సీఎంలు కూర్చొని బనకచర్ల ప్రాజెక్టుపై మాట్లాడుకోవాలి. నీటి ప్రాజెక్టులపై రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు. పోలవరం ప్రాజెక్టు కడుతున్న ఏపీకి కొత్త ప్రాజెక్టులు ఎందుకు? తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి"అని ఎమ్మెల్యే కూనంనేని కోరారు.

## విద్వేషాలు రెచ్చగొట్టడమే బీజేపీ పని : మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి

దేశంలో పేదలకు భూములు, ఇండ్లు, ఉద్యోగాలు ఇవ్వని బీజేపీ కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. రాష్ట్రంలో గిరిజనులను చెట్టుకు కట్టేసి కొట్టించిన చరిత్ర బీఆర్ఎస్ దని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కుటుంబం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిందని పేర్కొన్నారు.

గురువారం రాహుల్ గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకొని ములుగులోని గట్టమ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంచర్ల వరకు 2 వేల మంది యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఓ గార్డెన్ లో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మూడుసార్లు ప్రధానిగా అవకాశం వచ్చినా తృణప్రాయంగా వదిలేసి, పేదల కోసం పోరాడుతున్న వ్యక్తి రాహుల్ గాంధీ అని కొనియాడారు.

త్యాగాలు చేసిన నెహ్రూ, ఇందిరాగాంధీ, సోనియాగాంధీలపై బీజేపీ నాయకులు విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిరుపేదలకు ఏకకాలంలో 5 లక్షల ఇండ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు చేసిందేమీ లేదన్నారు. కాళేశ్వరం పేరిట చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేయించిన నీచ సంస్కృతి బీఆర్ఎస్‌పార్టీదన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌విజయానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి, స్పోర్ట్స్‌అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి సామ రామ్మోహన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య, రాష్ట్ర ఇన్‌చార్జి ఖలీద్, జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

## బనకచర్లపై ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చలకు సిద్ధం: రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

పీఎఫ్ఆర్ ఇచ్చేముందే తెలంగాణతో చర్చించి ఉంటే వివాదం ఉండేదికాదు. ఆంధ్రప్రదేశ్ ప్రీ ఫీజిబులిటి రిపోర్ట్ (పీఎఫ్ఆర్) ఇచ్చిన వెంటనే కేంద్రం స్పందిస్తోంది. బనకచర్లపై కేంద్రం అన్ని రకాల చర్యలకు సిద్ధమైంది.

ఇద్దరు సీఎంలు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై చర్చిద్దాం. ఒక రోజు కాదు నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయి. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం. వివాదాల పరిష్కారంలో నాకెలాంటి భేషజాలు లేవు. ఇద్దరు వ్యక్తులు కాదు.. రాష్ట్రాల మధ్య వ్యవహారం ఇది. విభజనచట్టం ప్రకారం ప్రాజెక్టుల్లో మార్పులు చేస్తే చెప్పుకోవాలి. విభజన చట్టం ప్రకారం గతంలో సీఎంల స్థాయిలో చర్చలు జరిపాం. అనేక అంశాలను సీఎం స్థాయిలో చర్చించాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## కేసీఆర్‌ను విలన్ చేసే యత్నంలో హరీష్

మొదటిపేజీ తరువాయి

జగన్ రెడ్డితో నాలుగు సార్లు మంతనాలు జరిపి తెలంగాణ నీళ్లకు అన్యాయం చేసింది కేసీఆర్ అని, హరీష్ రావు వైఖరి వల్లే ఏపీ నేతలు బనకచర్లకు నీళ్ళు తరలించుకుందామనే ఆలోచన చేశారని చామల కిరణ్ అన్నారు. గోదావరి జలాలపై గొంతు చించుకునే బీఆర్ఎస్ నేతలు.. కృష్ణా జలాలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. హరీష్ రావుకు కంటెంట్ కంటే ఎక్కువ ఆవేశమే ఉందని, బీఆర్ఎస్ నేతలు సీఎం కుర్చీలో రేవంత్ రెడ్డిని చూడలేక పోతున్నారని అన్నారు. నదీ జలాలు ఎవరి అయ్యా జాగీరు కాదని హరీష్ రావు తెలుసుకోవాలన్నారు. నీళ్ళ అంశంపై తనకు, కేసీఆర్‌కు తప్పా ఎవరికీ ఏం తెలియదని హరీష్ అనుకుంటున్నారని, తెలంగాణ నీటిని ఏపీకి ధారాదత్తం చేసిందే కేసీఆర్ అని చామల కిరణ్ ఆరోపించారు. హరీష్ రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడే ఈ పంచాయితీ మొదలైందన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం వినకపోతే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కుతామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి కమిట్‌మెంట్ అర్థం చేసుకోవచ్చునని అన్నారు. బనకచర్లపై ఏకగ్రీవ తీర్మాణం చేద్దామని అనుకునే సమయానికి ఆల్ పార్టీ మీటింగ్ నుండి బీఆర్ఎస్ ఎంపీ వాకౌట్ చేసారన్నారు. బేస్ వదిలి దోచుకునే ప్రయత్నం చేశారు కాబట్టే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారన్నారు. బేసిక్స్ కాదు తమకు ఎథిక్స్ ఉన్నాయి కాబట్టే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని ఎంపీ చామల కిరణ్ అన్నారు.

## పోలవరంతో భద్రాచలం మునక

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన గ్రామాల్లో ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని, పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆమె అన్నారు.పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందన్నారు. ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాములవారి మాన్యం వెయ్యి ఎకరాలు ఉందని, ఆ వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకు పోయిందన్నారు. దేవుడేమో తెలంగాణలో ఉన్నాడని.. అక్కడ పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంత మవుతోందన్నారు. దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలని కవిత అన్నారు.ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్ గఢ్ సీఎంలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న సమావేశంలో ఈ అంశాన్ని చర్చించాలని, ఐదు గ్రామాలను వెనక్కి తీసుకొచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి చేయాలని కవిత అన్నారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. లేదంటే ఎప్పుడైనా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయన్నారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందన్నారు. 2014లో ప్రధాని మోదీ మొట్ట మొదటి క్యాబినెట్ సమావేశంలో ఏడు మండలాలను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్‌ను ఆమోదించి తెలంగాణకు అన్యాయం చేశారని విమర్శించారు. ఆ ఏడు మండలాలను అన్యాయంగా ఏపీలో కలిపారన్నారు. లోయర్ సిలేరు విద్యుత్తు ప్రాజెక్టును కూడా ఏపీకి అప్పజెప్పారని... బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను తీసుకున్నారని విమర్శించారు. ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడే పార్లమెంటులో మేము గళమెత్తామన్నారు. కేసీఆర్ బంద్‌కు పిలుపునిచ్చినా కేంద్రానికి చీమకుట్టినట్టుగా లేదన్నారు. పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సామర్థ్యం 36లక్షల క్యూసెక్కుల నుంచి 50లక్షల క్యూసెక్కులకు పెంచుకుంటూ పోవడంతో ముంపు పెరిగిపోతోంది. మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కారం చేయాల్సిన అవసరముంది. పురుషోత్తమపట్నం, గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామపంచాయతీ లను వెనక్కి ఇవ్వాలి. ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట 4 రాష్ట్రాల సీఎంలతో ప్రధానమంత్రి మోదీ నిర్వహిస్తున్న సమావేశంలో ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణకు ఇస్తున్నట్లు ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు.

## పరస్పర అవగాహనతో కాంగ్రెస్, భారాస ముందుకెళ్తున్నాయి: కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: కాంగ్రెస్, భారాస పార్టీలు పరస్పర అవగాహనతో ముందుకెళు తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారాస పాలనలో జరిగిన అవినీతిపై ప్రజలకు వివరించాలని పార్టీ నేతలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్రాన్ని రక్షించాలంటే భాజపా ప్రభుత్వం రావాలని.. ప్రజలకు విశ్వాసం కల్పించి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ సహకారం లేకపోతే అభివృద్ధి కార్యక్రమాలు జరగవని పేర్కొన్నారు. కేంద్రం సాయంతోనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని కిషన్‌రెడ్డి వివరించారు.

## భారత్ కోసం గగనతలాన్ని తెరచిన ఇరాన్.. 1000 మంది విద్యార్థులు స్వదేశానికి!

మొదటిపేజీ తరువాయి

భారత్ కోసం ప్రత్యేకంగా మినహాయింపు ఇచ్చేందుకు సిద్ధమైంది. దీంతో ఇరాన్‌లో చిక్కుకుపోయిన దాదాపు 1000 మంది భారతీయులు కొన్ని గంటల్లో భారత్‌కు చేరుకోనున్నట్లు సమాచారం. 'ఆపరేషన్ సింధు' లో భాగంగా ప్రత్యేక విమానాల్లో వీరు స్వదేశానికి రానున్నారు.

ఆపరేషన్ సింధులో భాగంగా ఇరాన్‌లోని పలు నగరాల నుంచి ప్రత్యేక విమానాలు భారత్‌కు రానున్నట్లు తెలుస్తోంది. తొలి విమానం శుక్రవారం రాత్రి 11 గంటలకు ఢిల్లీ చేరుకోనుండగా.. మరో రెండు విమానాలు శనివారం దిగనున్నట్లు

# నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**





**నిజామాబాద్, ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20 :**
మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుంచి 26 వరకు నిర్వహించనున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం జరిగింది. వారం రోజుల పాటు చేపట్టే కార్యక్రమాల విజయవంతానికి చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిజామాబాద్ ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. డ్రగ్స్ మూలాలను గుర్తించి, వాటి రవాణా, విక్రయాలు, వినియోగం జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాల గురించి ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఎవరు కూడా పెడదోవ పట్టకుండా భావి పౌరుల భవిష్యత్తును కాపాడాలని హితవు పలికారు. ముఖ్యంగా యువత మత్తుపదార్థాల బారిన పడకుండా అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగిస్తూ అంకితభావంతో కృషి చేయాలన్నారు. విద్యా సంస్థల్లో మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేసి అవి క్రియాశీలకంగా పని చేసేలా చూడాలన్నారు. రానున్న రోజుల్లో మాదక ద్రవ్యాల నియంత్రణకు మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద స్థానికంగా ఉండే దుకాణాలపై నిఘా ఉంచాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను తెలిపే సందేశాత్మక వీడియోను అన్ని స్కూళ్ళు, కాలేజీలలో ప్రదర్శించాలని, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలను జాగృతం చేయాలన్నారు. ఈ నెల 25 మాదకద్రవ్యాల నియంత్రణ అంశం పై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని అన్నారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల గురించి ప్రజలు సమాచారం అందించేందుకు వీలుగా వివిధ టోల్ ఫ్రీ నెంబర్ ల గురించి ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం వంటి వాటి రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలని, టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు కూడా ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చని కలెక్టర్ జిల్లా ప్రజలకు సూచించారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారిని గుర్తించి, ఆ వ్యసనం బారి నుండి బయటపడేలా వారిని డీఅడిక్షన్ కేంద్రాలలో చేర్పించి తగిన చికిత్స జరిపిస్తూ కౌన్సిలింగ్ ఇప్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం రూపొందించిన గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, అదనపు డీసీపీ బస్వారెడ్డి, తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో నిజామాబాద్ జోన్ డీఎస్పీ సోమనాథం, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, డీఐఈఓ రవికుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు విరివిగా సేవలందించాలి

**- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి**





**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20**
వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా విస్తృత స్థాయిలో సేవలు అందించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం సాయంత్రం ఉద్యానవన శాఖ పనితీరుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ శాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలు, నిర్దేశిత లక్ష్యాలు, సాధించిన ప్రగతి, రైతులకు అందిస్తున్న తోడ్పాటు గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా జిల్లాలో పసుపు పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నందున రైతులకు మేలు రకానికి చెందిన, అధిక దిగుబడిని అందించే నాణ్యమైన పసుపు వంగడాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు కావడం వల్ల రైతులకు మేలు చేకూరుతుందని, పసుపు పరిశోధన కేంద్రం, స్పైస్ పార్క్ ద్వారా కూడా రైతులు ప్రయోజనం పొందేలా చూడాలన్నారు. అదేవిధంగా ఆయిల్ పామ్ సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 5600 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నారని, ఈ విస్తీర్ణం గణనీయంగా పెరిగేలా కృషి చేయాలన్నారు. ఈ ఏడాది 3000 ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు చేపట్టాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 979 ఎకరాలలో సాగు చేపట్టేందుకు రైతులు సంసిద్ధత తెలుపుతూ తమ వాటా మొత్తాన్ని డీ.డీల రూపంలో చెల్లించారని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందించడంతో పాటు, విత్తనాలను కూడా అందిస్తోందని, పంట నిర్వహణ కోసం ప్రతీ సంవత్సరం ఒక్కో ఎకరానికి 4200 రూపాయల చొప్పున వారి ఖాతాలలో నిధులు జమ చేస్తోందని తెలిపారు. ఆయిల్ పామ్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో పాటు, విత్తనాలు అందించిన కంపెనీలే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పంటను కొనుగోలు చేస్తాయని, కోతులు వంటి అటవీ జంతువుల బెడద ఉండదని, ఒకసారి పంట వేసుకుని మూడు సంవత్సరాల పాటు నిర్వహణ చేపడితే సుదీర్ఘ కాలం పాటు గణనీయమైన ఆదాయం లభిస్తుందని అన్నారు. ఇలా అనేక ప్రయోజనాలు కలిగిన ఆయిల్ పామ్ పంట గురించి క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి, స్వచ్ఛందంగా వారు ముందుకు వచ్చేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశం జిల్లా ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పోలవరం ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలి

**- 25న ప్రధాని ప్రగతి ఎజెండా సమావేశంలో దీనిపై చర్చించాలి**
**- పోలవరం నిర్వహించాలి ముంపుపై సంయుక్త సర్వే**
**- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**






**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20**
పోలవరం ప్రాజెక్టు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ లో కలిపిన ఐదు ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ నెల 25వ తేదీన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, చత్తీస్ గఢ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రగతి ఎజెండా పేరిట ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించబోయే సమావేశంలో ఈ అంశంపై చర్చించాలని సూచించారు. పోలవరం ముంపుపై, ఏపీలో కలిపిన భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలన్న అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. ఏపీలో కలిపిన గ్రామాల్లోని పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య వివక్షకు గురవుతూ ఏ ప్రభుత్వం పట్టించుకోకుండా ఉన్నారని వివరించారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని, లేదంటే ఏ ఒక్క ఏడాదిలో కూడా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందని తెలిపారు. పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందని పేర్కొన్నారు. ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాముడి భూమి వెయ్యి ఎకరాలు ఉందని, వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకి పోయింది.. దేవుడేమో తెలంగాణలో ఉన్నాడు అని తెలిపారు. అక్కడ పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరం ముంపుపై ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు.

అవసరమైతే ఈ అంశంపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందని గుర్తు చేశారు. 2014లో ప్రధాని మోదీ మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలో లో ఏడు మండలాలను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్ ను ఆమోదించి అన్యాయం చేశారని విమర్శించారు. ఏడు మండలాలను అన్యాయంగా ఏపీలో కలిపారని, లోయర్ సిలేరు విద్యుత్తు ప్రాజెక్టును కూడా ఏపీ అప్పజెప్పారని మండిపడ్డారు. బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను తీసుకున్నారని ఆరోపించారు. ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడే పార్లమెంటులో తాము గళమెత్తామని, బీఆర్ఎస్ పార్టీ సభ్యులం పార్లమెంటులో మాట్లాడాము కానీ కాంగ్రెస్ సభ్యులు మాత్రం ఆ నాడు కూడా పట్టనట్టు వ్యవహరించారని తెలియజేశారు. సీపీఐ - ఎంఎల్ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్ మాట్లాడుతూ, కేంద్రంలో చంద్రబాబు కీలకంగా ఉండటంతోనే 2014లో అవసరం లేకపోయినా తెలంగాణలోని ఏడు మండలాలను నరేంద్రమోదీ ప్రభుత్వం ఆంధ్రలో విలీనం చేసిందన్నారు. భద్రాచల రాముడికి మోదీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. పోలవరం ముంపులో భాగం కాని ఎటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలుపుతూ ఆర్డినెన్స్ తేవాలని డిమాండ్ చేశారు. భద్రాచలంతో తెలంగాణ ప్రజలకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. భద్రాచలం లేని తెలంగాణను ఊహించడం కష్టమన్నారు. ఈ నెల 25వ తేదీన ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో జరిగే సీఎంల మీటింగ్ లోఐదు గ్రామ పంచాయతీలపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు ఐదు గ్రామ పంచాయతీల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భద్రాచలం డెవలప్మెంట్ ఫోరం, ఐదు గ్రామ పంచాయతీల హక్కుల సాధన సమితి నాయకులు ??? సంపత్, ఆవులూరి సత్యనారాయణ, దాసరి బాలకృష్ణ, రాసాల నర్సయ్య, గొల్లపల్లి శివ, కాటిబోయిన ఆనంద్, వివిధ ప్రజాసంఘాల నాయకులు వీరన్న, రూప్ సింగ్, లోకిని రాజు, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. రౌండ్ సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను ఈనెల 25న నిర్వహించే ప్రగతి ఎజెండా సమావేశంలో ప్రధాని ముందు పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ

**- జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్,డీఈఓ రాముకు కృతజ్ఞతలు**



**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 20 :**
కోరుట్ల నియోజకవర్గంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని టీఎస్ జేయూ కోరుట్ల నియోజకవర్గ నాయకులు జిల్లా కలెక్టర్ నీ కోరగా తక్షణమే జిల్లా కలెక్టర్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీని కల్పించాలంటూ జగిత్యాల జిల్లా డిఈఓ కి తెలియపరచగా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ రాము జర్నలిస్టుల పిల్లలకి 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రొసీడింగ్ కాపీని టీఎస్ జెయు నాయకులకు అందజేశారు.ఈ సందర్భంగా టీఎస్ జేయు అధ్యక్షులు జోరిగే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తరి రాజశేఖర్ మాట్లాడుతూ... జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో పనిచేస్తున్నటువంటి టీఎస్ జేయూ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ప్రొసీడింగ్ కాపీని ఇవ్వడం పట్ల జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్,డీఈఓ రాము, సూపరిండెంట్ విజయ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడ దివాకర్, మీడియా ఇంచార్జ్ రవి రాజ్, ఈసీ మెంబర్లు గట్ల శ్రీనివాస్, సయ్యద్ ఫిరోజ్, శ్రీనివాస్ నాయక్, సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ నగర జర్నలిస్టుల ఛలో హైదరాబాద్

**- గుండెల నిండా విశ్వాసం, కలల పల్లకిలో ప్రయాణం**
**- ఇళ్ల స్థలాలను సాధించుకునేందుకు జర్నలిస్టుల ఆశల పయనం**



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20 :**
నిజామాబాద్ నగర జర్నలిస్టుల 'ఛలో హైదరాబాద్' యాత్రకు ఇది నినాదం. తమ చిరకాల స్వప్నమైన ఇళ్ల స్థలాలను సాధించుకునేందుకు, అండగా నిలిచే పిసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ లను కలిసేందుకు అడుగులు వేస్తున్నారు. ఇది కేవలం ఒక ప్రయాణం కాదు, తరతరాల కలను నిజం చేసుకునేందుకు వేసిన ప్రతి అక్షరం.
మన సమస్య మనమే పరిష్కరించుకోవాలి, హైదరాబాద్ వెళ్లి కలుద్దాం! అంటూ నగర జర్నలిస్టులు పలువురు మిత్రులు పట్టుబట్టడంతో, ఈ ఛలో హైదరాబాద్ ఒక ఆశల దీపంలా వెలుగుతోంది. ఇది కేవలం కొంతమంది వ్యక్తుల కోరిక కాదు, సమాజానికి వారధులుగా నిలిచే జర్నలిస్టులందరి ఉమ్మడి ఆకాంక్ష.
గతంలో ఎన్నో ఆటంకాలు ఎదురైనా, జర్నలిస్టుల ఐక్యత ముందు అవి ఎప్పుడూ నిలబడలేదు. ఈసారి కూడా అంతే ఏ చిన్నపాటి అనుమానం వచ్చినా, ఏ మాట చెవిలో పడినా, వాటన్నిటినీ పక్కన పెట్టి, ఈ ఆశల పయనంలో భాగస్వాములవుదాం. మనందరి కల ఒక్కటే %-% ఇళ్ల స్థలాలు. ఔర్ ఎక్ ధక్కా.. ఇండ్ల స్థలాలు పక్కా! %-% ఈ నినాదం కేవలం ఒక మాట కాదు, మనందరి గుండెల్లో నిండిన విశ్వాసం. ఇది కేవలం భూమి ముక్కల కోసం జరిగే ప్రయత్నం కాదు, జర్నలిస్టుల ఆత్మగౌరవం కోసం, వారి కుటుంబాల భద్రత కోసం సాగే ఓ పవిత్ర యాత్ర. ఈ పయనంలో అడుగడుగునా ఆత్మీయత, ఐక్యత కనిపిస్తాయి. మనందరి కలలు నిజం కావాలని మనసారా కోరుకుందాం.

## ఒలంపిక్ రన్ కార్యక్రమం ప్రారంభించిన పోలీస్ కమిషనర్



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20 :**
రాష్ట్ర ఒలంపిక్ సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఒలంపిక్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఒలంపిక్ రన్ ను జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈగ సంజీవ రెడ్డి, బొబ్బిలి నర్సయ్య అధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆర్. ఆర్ చౌరస్తా నుండి నుంచి పాత కలెక్టరేట్ వరకు జరిగిన ఓలంపిక్ రన్ ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్యఅతిథిగా జెండాను ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ ఒలంపిక్ ప్రపంచ దేశాలన్నీ ఈ క్రీడల్లో పాల్గొంటారని ప్రతి క్రీడాకారుని కల ఒలంపిక్ క్రీడల్లో పాల్గొనడం ఆశయమని అన్నారు. ఒలంపిక్ డే సందర్భంగా జిల్లా ఒలంపిక్ సంఘం నిర్వహించిన ఒలంపిక్ రన్ క్రీడాకారులు విద్యార్థులు పాల్గొనడం హర్షణీయమని అన్నారు. చదువుతోపాటు అందరి విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని ప్రతి విద్యార్థి ఏదైనా ఒక క్రీడను ఎంచుకొని అందులో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా జాతీయ జెండాను అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించాలని ఆకాంక్షించారు. ఈ ఈ సందర్భంగా ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కుండా ట్రాఫిక్ సిబ్బంది విధులను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది విధులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మెన్ కేశ వేణు, జిల్లా ఒలింపిక్ సంఘం సభ్యులు నిజామాబాద్ నగర ఏసిపి రాజా వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నెలలో నిజామాబాద్ జర్నలిస్టుల కు ఇండ్ల స్థలాలు

**- మహేష్ గౌడ్,షబ్బీర్ అలీ హామీ**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20 :**
నిజామాబాద్ నగరంలో పని చేస్తున్న జర్నలిస్టులందరికి నెలరోజుల్లోగా ఇండ్ల స్థలాలు ఇప్పిస్తామని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ హామీ ఇచ్చారు..
ఇండ్ల స్థలాల సాధన కోసం నిజామాబాద్ నుండి వెళ్లిన జర్నలిస్టులు శుక్రవారం వారిని కలిసి సుదీర్ఘంగా చర్చించారు.
నివాస యోగ్యం కాని గుండారం గుట్టలు కాకుండా నగరానికి సమీపంలో నివాస యోగ్యం కలిగిన స్థలాలను జర్నలిస్టులకు ఇవ్వాలని చేసిన డిమాండ్ పట్ల మహేష్,షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారు..
ఎట్టిపరిస్థితుల్లోనూ గుండారం భూములు జర్నలిస్టుల నివాస



స్థలాల కోసం ప్రతిపాదించరాదని వారు జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కి మహేష్ గౌడ్,షబ్బీర్ అలీ సూచించారు.. గుండారం భూములకు ప్రత్యామ్నాయ భూములను వెంటనే గుర్తించాలని కలెక్టర్ను ఆదేశించారు.. జర్నలిస్టు లకు అవసరమైన ఇండ్ల స్థలాలను ఎంపిక



చేయడానికి రేపటినుంచే క్షేత్ర స్థాయిలో పరిశీలన మొదలు పెట్టాలని ఆర్డీఓ ను ఆదేశించారు మహేష్ గౌడ్, షబ్బీర్ అలీ..
ఇండ్ల స్థలాలతో పాటు ఇండ్ల నిర్మాణం కోసం సహకరిస్తామని వారు మాట ఇచ్చారు..
ఈ సంధర్భంగా జర్నలిస్టులు షబ్బీర్ అలీ, మహేష్ గౌడ్ కు కృతజ్ఞతలు చెప్పారు..

# రేపు జరిగే టియుసిఐ భారీ ర్యాలీ,బహిరంగ సభలను జయప్రదం చేయండి

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20 :**
నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోటగల్లి శ్రామిక భవన్లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది.
ఈ సందర్భంగా టి యు సి ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నరేందర్, ఎం.సుధాకర్ లు మాట్లాడుతూ టియుసిఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా రేపు వేలాదిమంది కార్మికులతో రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి భారీ ర్యాలీ, పాత కలెక్టరేట్ గ్రౌండ్లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని, ఈ భారీ ర్యాలీ బహిరంగ సభలను జయప్రదం చేయాలని జిల్లాలోని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా టియుసిఐ ఆలిండియా అధ్యక్షులు కామ్రేడ్ అమ్రిష్ పటేల్ హాజరవుతారని, అదేవిధంగా జాతీయ కమిటీ నేతలు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వక్తలుగా హాజరవుతారన్నారు. 22 న




రేడియో స్టేషన్ వద్ద గల ఆర్.ఎన్ ఫంక్షన్ హాల్ లో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ సభలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన అతిథులు, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నాయకులు ప్రతినిధులుగా హాజరవుతారన్నారు. ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ప్రారంభ ఉపన్యాసం చేస్తారన్నారు. ప్రతినిధుల సభలో గత పోరాటాలను సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు. అదేవిధంగా నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. రేపు జరిగే ర్యాలీ, బహిరంగ సభలను జిల్లాలోని బీడీ కార్మికులు, మున్సిపల్, గ్రామపంచాయతీ, కేజీబీవీ, మోడల్ స్కూల్, మిషన్ భగీరథ, భవన నిర్మాణ రంగం, ఆటో మోటారు, ఆశ, హమాలి రంగ కార్మికులు వేలాదిమంది తరలి, మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఈ ప్రెస్ మీట్ లో టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వెంకన్న, జిల్లా నాయకులు పి.సాయన్న నాయకులు డి.గంగాధర్, ఎం.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# ఆదివారం రోజున సంతానం లేని దంపతుల కొరకై పుత్ర కామేష్టి యజ్ఞం

**- మీడియాతో వెల్లడించిన కంకణాల రాజేశ్వర్**


**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని వైదిక ధ్యాన యోగ కేంద్రం ఆశ్రమంలో ద్వి అష్టోత్తర సహస్ర గాయత్రీ మరియు మృత్యుంజయ సహిత సామవేద పారాయణ మహా యజ్ఞంలో భాగంగా సంతానం లేని దంపతుల ఆవేదన, విజ్ఞప్తిని దయార్ధ్ర హృదయంతో పరిశీలించి తేది:22-06-2025 మిథున రాశి భరణి నక్షత్రం సందర్భంగా ఆదివారం రోజున విశేష "పుత్ర కామేష్టి" యజ్ఞాన్ని ఆశ్రమ ప్రాంగణంలో వేద విద్వాంసులు



శ్రీశ్రీశ్రీ శ్రీధరానంద భారతీస్వామి, వైదిక పురోహితులు శ్రీశ్రీశ్రీ వేద పునీతానంద స్వామీజీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనడం ఎంతో భాగ్యం. సుదీర్ఘ కాలానంతరం ప్రత్యేక శ్రద్ధాసక్తులతో ఈ కార్యక్రమాన్ని చక్కటి ప్రణాళికతో, అన్ని వసతి సౌకర్యాలతో నిర్వహిస్తున్నారని స్వామీజీల అనుచరుడు కంకణాల రాజేశ్వర్ గురువారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా కంకణాల రాజేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ...సంతానం లేని దంపతులు తమ దైవిక అనువంశిక దోషాలను తొలగించుకునేందుకు, ఉత్తమ సంతానం పొందేందుకు ఇది సువర్ణావకాశం అని అన్నారు. కావున ఆసక్తి గల దంపతులు 8106941500 నంబర్ కు ముందస్తు సమాచారం అందజేసి పాల్గొనగలరు.

## ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

**- డీఈవో అశోక్ సర్క్యూలర్ జారీ**



PROCEEDINGS OF THE DISTRICT EDUCATIONAL OFFICER, NIZAMABAD.
(Present: Sri. P Ashok., M.Sc.,M.Ed.)

Rc.No.1406/A4/2025 Date:20-06-2025

Sub:- School Education – Private Unaided – Admission of children of Journalists of Print & Electronic Media – 50% Fee concession during the year 2025 – 2026 – Orders issued.

Ref:-
1. This office Proc.Rc.No.1953/A4/2024. Dt:08.07.2024.
2. Representation of Telangana State Union of Working Journalists (TUWJ) Nizamabad Dist. unit Dt:28.05.2025.
3. Representation of Telangana Working Journalist Federation, Nizamabad (TWJF), Nizamabad Dist. Unit Lr. Dt:11.06.2025.
4. Note orders of the Collector & District Magistrate, Nizamabad Dt:13.06.2025.

-::O::-

In view of the request made vide reference 2nd & 3rd cited and as per the note orders of the Collector & District Magistrate, Nizamabad vide reference 4th cited, all the Secretary & Correspondents of Unaided Private Schools in the are instructed to permit and allow 50% fee concession for the year 2025 - 2026 to the children of working Journalist in Electronic and Print Media in Nizamabad District as per the accreditations issued by the Collector & District Magistrate, Nizamabad.

The Receipt of these proceedings should be acknowledged.

District Educational Officer,
Nizamabad.

To
All the Secretary & Correspondent of Unaided Private Schools in the District
Copy to all the Mandal Educational officers in the District.
Copy to the Telangana State Union of Working Journalists (TUWJ) Nizamabad.
Copy to the Telangana Working Journalist Federation (TWJF), Nizamabad.
Copy submitted to the Collector & District Magistrate, Nizamabad for favour of kind information.

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20 :**
నిజామాబాద్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని డీఈవో అశోక్ సర్క్యూలర్ జారీ చేశారు. కావున జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల పిల్లలకు రాయితీ కల్పించాలని పేర్కొన్నారు.

## పోలీస్ డ్యూటీ మీట్ ప్రారంభించిన పోలీస్ కమీషనర్




**- పోలీస్ విధినిర్వహణలో సామర్థ్యం పెంచడానికి**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20 :**
తెలంగాణా రాష్ట్రంలో రెండవ పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహణలో భాగంగా శుక్రవారం నిజామాబాద్ పోలీస్ కమీషనరేటులో వివిధ రంగాలలో పోటీలు నిర్వహించినారు. ఈ పోటీల ద్వారా పోలీస్ విభాగంలో కానిస్టేబుల్ స్థాయి నుండి ఎ.సి.పి స్థాయి వరకు పని పద్ధతులు మెరుగుపడి ఇన్వేస్టిగేషన్ స్థాయిలు పెరుగుతాయి పనిలో పోటీతత్వం అలవాటుపడుతుంది. సైంటిఫిక్ ఇన్వేస్టిగేషన్, ఫింగర్ ప్రింట్ ఇన్వేస్టిగేషన్ కోసం ఎంపికలో భాగంగా నేడు నిజామాబాద్ పోలీస్ కమీషనరేటులో నేరాలు జరిగినప్పుడు అట్టి నేర స్థలంలో సేకరించవలసిన నేర సమాచారం కోసం " పోలీస్ క్లూస్ " ఏ విధంగా సేకరించాల అనేదని కోసం ఎంపిక పరీక్షలు



నిర్వహించడం జరిగింది
ఇందులో భాగంగా పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యలయంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య,,సమక్షంలో సి.ఐలు, ఎస్.ఐలు సిబ్బందికి ఎంపిక పరీక్షలు ప్రారంభించారు. ఇందులో ఫోరన్సిక్ సైన్స్ ఫింగర్ ప్రింట్, లిఫ్టింగ్,ప్యాకింగ్, ఐ.ఓ ఫోటో గ్రాఫి, వీడియోగ్రాఫీల కోసం ఎంపికలు నిర్వహించడం జరిగింది. ఎ.ఎస్.ఐ నుండి కానిస్టేబుల్ వరకు వారి అబ్జ ర్వేషన్ పని తీరును మెరుగుపర్చడం పరీక్షించడం అబ్జర్వేషన్ పరీక్ష, నిందితులను గుర్తించే పరీక్ష మొదలగునవి నిర్వహించడం జరిగింది.ఇందులో మంచి ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయిలో జరిగే డ్యూటీ మీట్ కార్యాక్రమానికి పంపడం జరుగుతుంది.ఈ కార్యాక్రమంలో నిజామాబాద్ అదనపు డి.సి.పి (అడ్మిన్) బస్వా రెడ్డి, సి.సి.ఎస్. ఎ.సి.పి నాగవేంద్ర చారీ, సీసీఆర్బి ఏసీపీ రవీందర్ రెడ్డి, సి.ఐలు, ఎస్.ఐలు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 25వ తేదీన వరంగల్లో జరుగు ఆపరేషన్ కగర్ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి .. గోడపత్రికల ఆవిష్కరణ

- **సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపు**

మహబూబాబాద్ జిల్లా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బట్టు అంజయ్య స్మారక భవనంలో ఆపరేషన్ వ్యతిరేక సదస్సు గోడ పత్రికలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన వరంగల్ లో ని అబూనుస్ ఫంక్షన్ హాల్ లో మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగర్ పేరుతో దాడి చేయడాన్ని ఖండిస్తూ తక్షణమే శాంతి చర్చలు జరపాలని కోరుతూ నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు ఆపరేషన్ 'కగార్ 'ని రద్దు చేయాలనీ, మావోయిస్టు పార్టీ తో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు నిర్వహించాలని, కాల్పుల విరమణ పాటించాలని, దేశం లోని అడవి ని అడవి లో ఉన్న ఖనిజా సంపదని బడా కార్పొరేట్ శక్తుల కి అప్పచెప్పడానికి,అడవి నుండి ఆదివాసులని వెళ్లగొడుతున్నారని, వారికీ అండగా ఉన్న నక్సలైట్ లని ఆపరేషన్ కగార్ పేరు తో బుటకపుఎన్కౌంటర్ చేస్తున్నారని, కా!గాజర్ల రవి ని కూడా బుటకపు ఎన్కౌంటర్ చేసారని, ఈ ఎన్కౌంటర్ పై న్యాయ విచారణ జరపాలని, ఆపరేషన్ కాగారు కి వ్యతిరేకంగా ( సిపిఐ ఎంఎల్ )న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన, నిరసన, సదస్సు లు నిర్వహిస్తున్నామని తెలిపరు. ఈ సందర్భంగా జరిపే సదస్సును ప్రజలు ప్రజాస్వామ్యవాదులు విప్లవ అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో పార్టీ మహబాద్ డివిజన్ కార్యదర్శి

## బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఇంటర్ విద్యా అధికారి



**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20 :**
నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ శుక్రవారం ఉదయం నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా తనిఖి చేశారు. కళాశాల లో ప్రేయర్ సమయానికి ఆయన కళాశాలకు చేరుకున్నారు. అధ్యాపకులు, సిబ్బంది హాజరు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ బుద్దిరాజ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఇంటర్ విద్య అధికారి మాట్లాడుతూ కళాశాలలో మరింత మెరుగుగా అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగించాలని సూచించారు. అలాగే అధ్యాపకులు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారినీ ప్రోత్సహిస్తూ కళాశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేట్ల చూడాలని అన్నారు. రెండవ సంవత్సరం విద్యార్థుల తరగతులను ప్రణాళిక బద్ధంగా ప్రారంభించాలని అన్నారు.
కళాశాలలో సిబ్బంది, అధ్యాపకుల పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ తో పాటు సిబ్బంది అధ్యాపకులు పాల్గొన్నారు.


## కొంపల్లి కళ్యాణ్ జ్వెలర్స్ ను ప్రారంభించిన అక్కినేని నాగార్జున నటి శ్రీలీలా




**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) జూన్ 20 :**
కుత్బుల్లాపూర్ కొంపల్లి లో అతిపెద్ద అత్యంత విశ్వాసనీయ ఆభరణాల బ్రాండ్లలో ఒకటైన కళ్యాణ్ జ్యువెలర్స్ కొంపల్లి సమీపంలోని సుచిత్ర సర్కిల్ వద్ద సరికొత్త షోరూం ప్రారంభించిన బ్రాండ్ అంబాసిడర్ అక్కినేని నాగార్జున నటి శ్రీ లీల ఈ షో రూమ్ ని ప్రారంభించారు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అభిమానులు భారీగా పాల్గొన్నారు బ్రాండ్ అంబాసిడర్ అక్కినేని నాగార్జున మాట్లాడుతూ కళ్యాణ్ జ్యువెలర్స్ తో నాకున్న దీర్ఘకాల అనుబంధం పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను నమ్మకమే జీవితం అనే కంపెనీ సిద్ధాంతం పట్ల వారి నిబద్ధత పరిశ్రమలో వారిని ప్రత్యేకంగా నిలబెట్టింది వారి సేవ నైపుణ్యం కస్టమర్ కేంద్రీకృతత పట్ల కంపెనీ యొక్క అంచంచలమైన అంకిత భావం కళ్యాణ్ జువెలర్స్ ను దాని సహచర సంస్థల నడుమ భిన్నంగా నిలిచింది ఈరోజు మీ అందరిని కలిసే అవకాశం లభించినందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు బ్రాండ్ తమ తదుపరి ఉత్తేజకరమైన వృద్ధి దశను ప్రారంభిస్తున్న వేళ మీ నిరంతర మద్దతు కోసం ఎదురు చూస్తున్నాం అని అన్నారు.
ఈ సందర్భంగా శ్రీలీలా మాట్లాడుతూ ఈ కొత్త కళ్యాణ్ జువెలర్స్ షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొనడం పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను విశ్వసనీయత నిజాయితీ మరియు కస్టమర్ల పట్ల అంకితభావాన్ని వేరుగాంచిన బ్రాండ్ కు సంబంధించి ఇంతటి చిరస్మరణీయమైన సందర్భం కోసం ఇక్కడకు రావడం ఒక గౌరవంగా భావిస్తున్నాను కళ్యాణ్ జ్యువెలర్స్ తమ అద్భుతమైన ఆభరణాల కలెక్షన్ తో స్థానిక ఆభరణాల స్త్రీలు హృదయాలను గెలుచుకుంటున్నడంలో నాకు ఎటువంటి సందేహం లేదు అని అన్నారు.

# మెప్మా ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 20 :**
నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఈ నెల 21న శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తెలిపారు. మహిళ సంఘాల సభ్యులు, వీధి విక్రయదారులు, చిరు వ్యాపారాలు చేసేవారు ఈ కార్యక్రమంలో వారు తయారు చేసిన తిను బండారాల ఉత్పత్తులు ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని అన్నారు.



నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

తేది: 20.06.25.

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఈ నెల 21 తేది న శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్ కార్యక్రమాలు ఏర్పాటు చేయనునైనది. మహిళ సంఘాల యొక్క సభ్యులు, వీధి విక్రయదారులు, చిరు వ్యాపారాలు చేసేవారు.ఈ కార్యక్రమంలో వారు తయారుచేసిన తిను బండారాల ఉత్పత్తులు ప్రదర్శన,అమ్మకాలు ఉంటుంది.

కావున నగర పౌరులు, అధికారులు,అందరు ఈ కార్యక్రమంలో పాల్గొని మెప్మా సభ్యులు, వీధి విక్రయదారులకు చేయూత నివ్వాల్సిందిగా విజ్ఞప్తి.

Sd/
కమీషనర్
నగర పాలక సంస్థ
నిజామాబాద్.

(C. Ramesh)
T.P.R.O.
NMC.
Cell No: 9701210111

కావున నగర ప్రజలు, అధికారులు, అన్ని వర్గాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొని మెప్మా సభ్యులు, వీధి విక్రయదారులకు చేయూతను అందించాలని కమిషనర్ కోరారు.



# 'కుబేర'పై సాయిపల్లవి అభిప్రాయమిదే.. ఆసక్తికర పోస్ట్ పెట్టిన నటి

ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' . శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలోనే దీనిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు నటి సాయిపల్లవి. ఈ ప్రాజెక్ట్‌లో ఎన్నో విశేషాలు ఉన్నట్లు ఆమె చెప్పారు. టీమ్ అందరికీ ఇది సంతోషాన్ని ఇవ్వాలని ఆమె కోరుకున్నారు. తన గురువు (శేఖర్ కమ్ముల) మరో అద్భుతమైన విజయాన్ని అందుకోవాలని సాయిపల్లవి ఆకాంక్షించారు.

"కుబేర' ఎంతో ప్రత్యేకమైన చిత్రం. దీనికి ఎన్నో కారణాలు ఉన్నాయి. సవాలుతో కూడుకున్న పాత్రలను ఎంచుకోవడంలో ఎప్పుడూ ముందుండే ధనుష్ మరోసారి తన నటనతో ప్రేక్షకులను అలరించనున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో అగ్ర కథానాయకుడు నాగార్జునను ఇలాంటి అద్భుతమైన పాత్రలో చూడటం అభిమానులకు కనువిందు కానుంది. శేఖర్ తెరకెక్కించే చిత్రాల్లో కథానాయికల పాత్రలు పవర్‌ఫుల్‌గా ఉంటాయనే విషయం సినీ ప్రియులందరికీ తెలుసు. అదేవిధంగా ఇందులో రష్మిక పోషించిన పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. ప్రస్తుతం బ్లాక్‌బస్టర్స్‌తో కొనసాగుతోన్న ఆమెకు ఈ సినిమా మరో విజయాన్ని అందించనుంది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్.. మీ కెరీర్‌లోని బెస్ట్ ఆల్బమ్స్‌లో ఇదీ ఒకటి కానుంది. ఈ సినిమా కోసం చెమటోడ్చిన ప్రతిఒక్కరికీ ప్రశంసలు దక్కాలని కోరుకుంటున్నా. నిర్మాత సునీల్ గారు రూపొందిస్తోన్న చిత్రాలు చూసి ఆయన తండ్రి నారాయణ్‌దాస్ గారు ఎంతో సంతోషిస్తుంటారు. స్వచ్ఛమైన హృదయం, అద్భుతమైన టాలెంట్ కలిగిన వ్యక్తి, నాకెంతో ఇష్టమైన దర్శకుడు శేఖర్ కమ్ముల గారు. తన కథలతో ఆయన ఎంతోమందిలో స్ఫూర్తి నింపారు. అలా, ప్రేరణ పొందిన వారిలో నేనూ ఒకదాన్ని. నా గురువు ఎప్పుడూ సంతోషం, ఆయురారోగ్యాలతో జీవించాలని, ఇలాంటి అద్భుతమైన కథలెన్నో మనకు అందించాలని నేను కోరుకుంటున్నా. నేడు ఈ టీమ్ అందరి ఆనందం కోసం నేను ప్రార్థిస్తున్నా" అని ఆమె రాసుకొచ్చారు.ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన చిత్రమిది. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించారు. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో జూన్ 20న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

# ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై సుదీప్ స్ట్రాంగ్ కామెంట్



కన్నడ చిత్ర పరిశ్రమలోని నటీనటులను ఉద్దేశించి గతంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. వారి తీరు మారకపోతే.. ఏవిధంగా సరిచేయాలో తనకు తెలుసన్నారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా నటుడు సుదీప్ ఓ చర్చా కార్యక్రమంలో స్పందించారు."మనం ప్రయాణించే కారు నట్లు, బోల్టులు కూడా అప్పుడప్పుడూ బిగించాల్సి ఉంటుంది. అలాంటప్పుడు మనం సరైన మెకానిక్‌ను సంప్రదిస్తాం. ఎందుకంటే వారికి మాత్రమే కారు గురించి పూర్తి అవగాహన ఉంటుంది. అదే విధంగా ఇండస్ట్రీలో ఉన్న వ్యక్తులకు మాత్రమే ఇక్కడి పరిస్థితులు పూర్తిగా అర్థమవుతాయి. ఆయన ఎందుకు అలాంటి కామెంట్స్ చేశారో నాకు తెలియదు. కానీ, ఆయనంటే నాకెంతో గౌరవం. ఇలాంటి వ్యాఖ్యలు చేసే ముందు.. ఇండస్ట్రీలోని పరిస్థితిని కాస్త అర్థం చేసుకుని ఉండాల్సింది. అలా చేసి ఉంటే ఆయనపై నాకున్న గౌరవ మర్యాదలు మరింత రెట్టింపయ్యేవి. ఆయన పిలిచిన ప్రతిసారీ మేమంతా వెళ్లాం. ఎన్నో కార్యక్రమాల్లో పాల్గొన్నాం" అని సుదీప్ చెప్పారు.ఈ ఏడాది మార్చిలో బెంగళూరు వేదికగా అంతర్జాతీయ చలన చిత్రోత్సవం జరిగింది. ప్రారంభ కార్యక్రమంలో నటీనటులు పాల్గొనకపోవడంపై ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "నటీనటులు, దర్శక నిర్మాతలు ఒకే తాటి మీదకు రావాలి. రాష్ట్రంలో జరిగే కీలక కార్యక్రమాల్లో పాల్గొనాలి. సినిమా పరిశ్రమకు ప్రభుత్వ మద్దతు కూడా ఎంతో అవసరం అని అందరూ గుర్తుంచుకోవాలి" అని అన్నారు. నటీనటుల తీరు మారకపోతే వారిని ఏవిధంగా సరిచేయాలో కూడా తనకు తెలుసన్నారు.

## నాని హిట్-3 సినిమాకు చిక్కులు

### కథను కాపీ కొట్టారంటూ కోర్టుకెక్కిన రచయిత

నాచురల్ స్టార్ నాని హీరోగా, శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హిట్-3'. మే 1వ విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. నాని కెరీర్‌లోనే 100 కోట్ల క్లబ్‌లో చేరింది. అయితే తాజాగా ఈ సినిమా చిక్కుల్లో పడింది. ఈ సినిమాలో తన కథను కాపీ కొట్టారని అంటూ.. ఓమహిళ కోర్టుకెక్కింది. హిట్-1, హిట్-2 చిత్రాల సిరీస్‌లో భాగంగా శైలేష్ హిట్-3ని తెరకెక్కించారు. అయితే తన స్టోరీని కాపీ కొట్టారంటూ మహిళా రచయిత విమల్ సోని మద్రాస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతేకాక విమల్ సోని నానికి వీరాభిమాని అని పేర్కొన్నారు. తాను రాసిన ఏజెంట్ 11, ఏజెంట్ కథల నుంచి హిట్-3 సినిమాను తీశారని ఆమె తెలిపారు. దీంతో హిట్-3 మేకర్స్‌పై కాపీరైట్ కేసు వేశారు. ఆమె రచించిన ఒరిజినల్ కాపీని కోర్టుకు సమర్పించారు. అయితే గతంలో కూడా దర్శకుడు శైలేష్ కొలను ఇలాంటి వివాదాన్ని ఎదురుకున్నారు. వెంకటేష్ హీరోగా ఆయన 'సైంధవ్' అనే సినిమాను తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఈ సినిమా కథను కూడా కాపీ కొట్టారు అంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.



## కమెడియన్ దర్శకత్వంలో సూర్య సినిమా.. టైటిల్ ఇదే

కెరీర్ పరంగా సరైన విజయం అందుకోవడం కోసం ఎంతగానో శ్రమిస్తున్నారు నటుడు సూర్య . ఆయన హీరోగా కోలీవుడ్ హాస్య నటుడు ఆర్జే బాలాజీ కొత్త సినిమా రూపొందిస్తోన్న విషయం తెలిసిందే. సూర్య 45గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను చిత్రబృందం ప్రకటించింది. 'కరుప్పు' నే పేరు ఫిక్స్ చేసినట్లు తెలిపింది. టైటిల్ పోస్టర్ షేర్ చేసిన సూర్య దర్శకుడికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు.డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న మూవీకి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఫాంటసీ యాక్షన్ మూవీగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు కోలీవుడ్‌లో టాక్. దాదాపు ఏడాదికి పైగా స్క్రిప్ట్‌పై కసరత్తులు చేసినట్లు చిత్ర యూనిట్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. రేడియో జాకీగా కెరీర్‌ను ప్రారంభించిన బాలాజీ మల్టీ టాలెంటెడ్. నటుడు, గాయకుడు మాత్రమే కాదు, దర్శకుడిగానూ తన సత్తా చాటారు. నయనతార కీలక పాత్రలో ఆయన రూపొందించిన 'అమ్మోరు తల్లి' మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత 'వీట్ల విశేషం' అంటూ సత్యరాజ్‌తో ఓ మూవీ తీసి విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ముచ్చటగా మూడోసారి హీరో సూర్యతోనే మూవీ చేస్తున్నారు.

# కోటీశ్వరుడు vs బిచ్చగాడు..

## శేఖర్ కమ్ముల లక్ష కోట్ల స్కామ్ కథేంటంటే?

టాలీవుడ్ ప్రముఖ డైరెక్టర్ శేఖర్ కమ్ముల 'కుబేర'మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఈ మూవీలో నాగార్జునతోపాటు తమిళ స్టార్ హీరో ధనుష్, నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ముఖ్య పాత్రలు పోషించారు. ఇవాళ (జూన్ 20) కుబేర మూవీ.. వరల్డ్ వైడ్?గా థియేటర్లలో విడుదలైంది.ఈ సినిమాని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్?పై ప్రముఖ సినీ నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు సంయుక్తంగా నిర్మించారు. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, కార్తిక శ్రీనివాస్ ఎడిటింగ్, నికేత్ బొమ్మిరెడ్డి సినిమాటోగ్రఫీ అందించారు.తెలుగు, తమిళ క్రైమ్ థ్రిల్లర్ డ్రామాతో వచ్చిన కుబేర కథేంటీ? అసలేమీ తెలియని ఓ బిచ్చగాడు ప్రభుత్వాన్ని ఏవిధంగా ప్రమాదంలో పడేసాడు? ధనిక, మధ్య తరగతి, పేద అనే మూడు ప్రపంచాల మధ్య ఎలాంటి సంఘర్షణ జరిగిందనేది రివ్యూలో చూద్దాం.

**కథేంటంటే:**

ప్రముఖ పారిశ్రామికవేత్త నీరజ్ (జిమ్ సర్ఫ్). ఇతనొక బిగ్గెస్ట్ బిలియనీర్. లక్షల కోట్ల ఖరీదు చేసే ఆయిల్ నిక్షేపాలను తనకు కట్టబెట్టేందుకు ప్రభుత్వ పెద్దలతో లక్ష కోట్ల డీల్ సెట్ చేసుకుంటాడు. అంత భారీ మొత్తం చేతులు మార్చడానికి మాజీ %జదీ×%ఆఫీసర్ దీపక్ (నాగార్జున) సహాయం కొరతారు.

దీపక్ స్వతహాగా సిన్సియర్ ఆఫీసర్ అయినప్పటికీ.. అక్రమ కేసుల్లో జైలు పాలవడంతో.. గత్యంతరం లేని పరిస్థితుల్లో అందుకు అంగీకరిస్తాడు. జైలు నుంచి విడుదలైన దీపక్.. లక్ష కోట్ల బదిలీ కోసం బినామీలుగా నలుగురు బిచ్చగాళ్ళను ఎంపిక చేస్తాడు.


తిరుపతిలో బిక్షం ఎత్తుకుంటున్న దేవా (ధనుష్) అందులో ఒకడు. దేవా పేరుపై బినామీ కథలు ఓపెన్ చేసి పదివేల కోట్లు జమ చేస్తారు. కానీ ఆ తర్వాత దేవా.. వాళ్ల నుంచి తప్పించుకుని పోతాడు. అతని ఎందుకు తప్పించుకున్నాడు? దీపక్ ప్లాన్ వర్కౌట్ అయిందా? ఇందులో సమీర (రష్మిక) పాత్ర ఏమిటి? అసలు ఈ బిచ్చగాడు కథకు 'కుబేర' టైటిల్ ఎందుకు పెట్టారనే ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.




**విశ్లేషణ:**

తెలుగు సినీ పరిశ్రమలో సెన్సిటీవ్ చిత్రాలు చేస్తూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నాడు దర్శకుడు శేఖర్ కమ్ముల. తన మొదటి సినిమా ఆనంద్ నుండి మొన్నొచ్చిన లవ్ స్టోరీ వరకు.. ఆయన చిత్రాలన్నీ అలానే ఉంటాయి.కేవలం భావోద్వేగాలపై కథను నడిపించడం, అందులో ఒక సామజిక అంశాన్ని చూపించడం కమ్ముల స్పెషాలిటీ. అలా వచ్చినవే.. ఆనంద్, గోదావరి, హ్యాపీ డేస్, లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్, ఫిదా, లవ్ స్టోరీ సినిమాలు. ఆయన సినిమాల్లో హీరోయిజం ఉండదు. కథే ఆయన బలం. అందుకే ఆయన సినిమాలకు సెపెరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. అలాంటి దర్శకత్వ మార్క్ తోనే కుబేర ఉంటుందని చెప్పడంలో సందేహం లేదు. ఈ సినిమాతో అతని మార్క్‌ను ఒక మెట్టు పైనే ఉంచారు కానీ, కిందికి మాత్రం పడెయ్యలేదు. కుబేర.. ఇది ఒక లక్ష కోట్ల స్కామ్ కథ.

ప్రస్తుత సమాజంలో.. కార్పోరేట్ వ్యవస్థలు రాజకీయాలను ఎలా శాసిస్తున్నాయి? రాజకీయ నాయకులు తన స్వార్థం కోసం ఎలాంటి అవినీతి పనులు చేస్తున్నారు? బ్లాక్ మనీ ఎలా చేతులు మారుతుంది? బినామీ వ్యవస్థలు ఎలా ఉంటాయనేది కళ్లకు కట్టినట్లుగా చూపించాడు. ఇందుకోసం దర్శకుడు శేకర్ కమ్ముల చాలా లోతుగా అధ్యయనం చేసిన తీరు కథలో కనిపిస్తుంది.



ఇలాంటి సామజిక అంశాలకు.. కమ్ముల తనదైన శైలిలో ఇంటెన్సి ఎమోషన్స్ తో పాటుగా ఇంట్రస్టింగ్ థ్రిల్లింగ్ అంశాలను జోడించాడు. ఎంగేజింగ్ స్క్రీన్ ప్లేకి, ట్విస్టులు రాసుకోవడం వల్ల కుబేర సీడ్ ఎడ్జ్ థ్రిల్లర్ గా మారింది.

ఫస్టాఫ్ అంతా.. కథలో భాగంగా పాత్రల పరిచయం, ఒక్కో పాత్రకి, ఒక్కో సందర్భం. ఏం జరగుతుందా అన్న ఇంటెన్సితో చూసేలా ఉంది. బిచ్చగాడితో కోటీశ్వరుడు ప్రయాణం, ఆ తర్వాత బిచ్చగాడు చావు నుంచి తప్పించుకోవడం వంటి సీన్లతో ఎంగేజింగ్‌గా సినిమా సాగుతుంది. దేవాని పట్టుకుంటారనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో పెరిగే ఇంటర్వెల్ సీన్ అదిరిపోయింది.

సెకండాఫ్ విషయానికి వస్తే.. దేవా తప్పించుకుపోయిన తర్వత కథలో మరింత వేగం పుంజుకుంటుంది. చివరికి బిజినెస్ మెన్ నీరవ్ మిత్రా బిచ్చగాడిలా మారడం.. అధికార బలం ఉన్నా బిచ్చగాడిని పట్టుకోలేకపోవడం వంటి సీన్లతో ఎంతో ఎంగేజింగ్‌గా ఉంటుంది. క్లైమాక్స్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుంది.

ఓవరాల్ గా డబ్బు, పవర్ మాత్రమే దేశాన్ని నడుపుతున్నాయి. ఇక్కడ నీతి, నిజాయితీ, న్యాయం, ధర్మం వీటికి చోటే లేదు.. అంటూ సగటు పౌరుడిలోని ఓ ఆవేదనకి కుబేర మూవీ అద్దం పట్టేలా సాగడం ఆసక్తి పెంచుతోంది. క్లైమాక్స్ ఎపిసోడ్ సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచింది.

**ఎవరెలా నటించారంటే:**

అసలేమీ ఆశించని బిచ్చగాడి పాత్రలో ధనుష్ ఒదిగిపోయి నటించాడు. తన అసాధారణ నటనతో జాతీయ అవార్డు స్థాయిలో పెర్ఫార్మన్స్ అందించాడు. ఇలాంటి పాత్రల్లో నటించాలంటే ధనుష్‌కే సాధ్యం. మధ్య తరగతి ధనికుడిగా నాగార్జున తనలోని కొత్త కోణం చూపించాడు. సమీర క్యారెక్టర్ లో రష్మిక మందన్నా ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. వ్యాపారవేత్తగా నీరజ్ సైతం తన నటనతో మెప్పించాడు. మిగతా పాత్రల్లో నటించిన వారు కుబేర సినిమాకు న్యాయం చేశారు.

**సాంకేతిక అంశాలు:**

పేద, గొప్ప కథను ఎవరు చెప్పినా అందులో పేదవాడు గెలవాలని, సమానత్వం ఉండాలనే ఎవరైనా కోరుకుంటారు. కానీ దాన్ని ఎలా చెప్పామనేది ముఖ్యం. అదే శేఖర్ కమ్ముల. వాస్తవికతకు దగ్గరగా ఉంటూనే ఓ థ్రిల్లింగ్ పాయింట్‌తో తెరకెక్కించి సక్సెస్ అయ్యాడు. ఈ సినిమాకు మరో ముఖ్యమైన హీరో దేవిశ్రీ ప్రసాద్. తన బీజీఎమ్, సాంగ్స్ అన్నింట్లో సక్సెస్ అయ్యాడు. చాలా చోట్ల తన సంగీతమే సినిమా స్థాయిని పెంచేసింది. నికేత్ బొమ్మిరెడ్డి సినిమాటోగ్రఫీ, కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్ సినిమాను నిలబెట్టడంలో తోడ్పడ్డాయి. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి. పెట్టిన ప్రతిపైసాకు న్యాయం జరిగింది.

## అల్లు అర్జున్, అట్లీ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్

యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ఫిక్స్ అయినట్లు టాక్ పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ డైరెక్షన్ లో సినిమా వస్తున్నా సంగతి తెలిసిందే. బన్నీ కెరీర్ లో 22వ సినిమాగా వస్తున్న ఈ సినిమాపై ఇప్పటి నుండే అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. కోలీవుడ్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్స్ లో ఒకటైన సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్ పై ఈ సినిమాను నిర్మిస్తోంది. దీపికా పాడుకొనే, మృణాల్ ఠాకూర్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు.కాగా ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ ఎవరు అనే క్యూరియాసిటీ నెలకొంది. అనిరుధ్, సాయి అభ్యంకర్ వీరి ఇద్దరు పేర్లు గత కొన్ని నెలలుగా వినిపిస్తున్నాయి. కానీ ఎవరిని లాక్ చేయలేదు మేకర్స్. ఇప్పుడు అందుతున్న విస్వసనీయ సమాచారం ప్రకారం అల్లు అర్జున్, అట్లీ సినిమాకు కోలీవుడ్ యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ను ఫిక్స్ చేసారని తెలిసింది. త్వరలోనే ఈ విషయాన్ని అధికారకంగా ప్రకటించ బోతున్నారట మేకర్స్. కోలీవుడ్ లో ఇప్పుడు సాయి సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాడు. ఇప్పటికే సూర్య నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం కరుప్పు తో పాటు లోకేష్ కనగరాజ్ నిర్మిస్తున్న బెంజ్, ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ సినిమాలకు మ్యూజిక్ అందిస్తున్నాడు. ఇప్పుడు అల్లుఅర్జున్ ? అట్లీ కాంబోకు కు కూడా ఈ యువ సంచలం మ్యూజిక్ ఇస్తుండడం మనోడి క్రేజ్ ఎలా ఉందో తెలుస్తోంది.